ప్రజాభిప్రాయ సేకరణ మళ్లీ చేపట్టాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జనవరి 29: అర్ధరాత్రి దొంగలు, నక్సలైట్లను నిర్బంధించినట్టు ప్రశ్నించే గొంతుకలను, తమను నిర్బంధించి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని, మళ్లీ ప్రజల సమక్షంలో చేపట్టాలని ఎన్టీపీసీ యాజమాన్యాన్ని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ అంటే కేవలం అధికారపార్టీ నాయకులు మాట్లాడడమా..? లేక ప్రతిపక్ష పార్టీలు మాట్లాడకుండా అరెస్టు చేయడమా..? అని ప్రశ్నించారు. పోలీస్ నిర్బంధంలో ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీలో 2400 మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్ కోసం మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ పోలీస్ పహారాలో ప్రజలు లేకుండా జరిగిందని విమర్శించారు. కార్యక్రమానికి రాకుండా అక్రమ అరెస్టులు చేశారని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రశ్నించే అవకాశం లేకుండా పోయిందని ఆగ్రహించారు. రామగుండంలో నిర్బంధ పాలన కొనసాగుతున్నదని, ప్రశ్నిస్తే పోలీసులతో అరెస్టులు చేయిస్తున్నారని వాపోయారు. నాడు ఎన్టీపీసీ ప్లాంట్ ఏర్పాటుకు భూములను త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు నేటి వరకు విద్యా వైద్యం, ఉద్యోగావకాశాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని, పైగా బెదిరింపులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, రమణారెడ్డి, గాదం విజయం, బాదె అంజలి, నాయకులు జెవి రాజు, అచ్చె వేణు, చల్లా రవీందర్‌రెడ్డి, రాకం దామోదర్, నారాయణదాసు మారుతి, కొలిపాక శరణ్య, శ్రీవాణి, ముద్దసాని సంధ్యారెడ్డి, సట్టు శ్రీనివాస్, ఇరుగురాళ్ల శ్రావణ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కారించాలి

ఎన్టీపీసీ స్టేజీ -2 ప్లాంటు విస్తరణలో ప్రభావిత ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కారించాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌ను కలిసిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు కుమ్మరి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, ఇరుగురాళ్ల శ్రావణ్, వండ్లకొండ మహేందర్ ఉన్నారు.

బాధితునికి పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, జనవరి29: చిన్నరాత్పల్లి కి చెందిన జర్నలిస్ట్ బందెల రాజశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దే ఉంటున్నాడు. బాధితుడిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పరామర్శించి రూ.5వేలు అందజేశారు. పార్టీ పరంగా రాజశేఖర్ కుటుంబాన్ని ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు నారాయణదాసు మారుతి, నూతి తిరుపతి, ఇరుగురాళ్ల శ్రావణ్, వడ్లకొండ మహేందర్, టీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు బుర్ర సంపత్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు అంకరి ప్రకాశ్, టీ న్యూస్ జిల్లా ప్రతినిధి కాల్వ రమేశ్ లు ఉన్నారు.

తేలుకుంటలోని రామప్ప చెరువు వద్ద కూలిన తూము చెక్ డ్యామ్

కూలిన 'రామప్ప' చెక్ డ్యామ్

జూలపల్లి, జనవరి 29 : తేలుకుంటలోని రామప్ప చెరువు మధ్య తూము చెక్ డ్యామ్ కూలిపోయింది. దాదాపు రెండేండ్ల నుంచి రైతులు పంటలు సాగు చేయలేక వదిలేశారు. చెక్ డ్యామ్ వద్ద ముళ్ల చెట్లు, మర్రి, రావి చెట్లు మొలిచి చెక్ డ్యామ్ కిందికి వేళ్లు చొచ్చుకు పోవడంతో చెడిపోయింది. దీంతో దాదాపు 6 వందల ఎకరాల్లో వ్యవసాయ భూములు బీళ్లుగా మారాయి. రామిట్ట భూములతోపాటు, ధూళికట్ట వరకు గతంలో సాగునీరు వెళ్లేది. చెక్ డ్యామ్ కూలడం, కాలువులు పూర్తిగా దెబ్బతిని చుక్కనీరు పారకపోవడంతో 4 పంటలు కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి చెక్ డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేశారు.

రైతులు పశువుల పెంపకం చేపట్టాలి

ఓదెల, జనవరి 29: రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం చేపట్టి ఆర్థికంగా వృద్ధిలోకి రావాలని పశువైద్యాధికారి మల్లేశం కోరారు. కొమిరె గ్రామంలో బుధవారం పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో కృత్రిమ గర్భదారణ వల్ల మేలు జాతి ఆడదూడలు జన్మిస్థాయని పేర్కొన్నారు. ఇక్కడ అధిక పాలు ఇస్తున్న పశువుల యజమానులు లింగాల కిషన్‌రెడ్డి, గోలి నాగరాజులను గుర్తించి ప్రభుత్వ ప్రోత్సహకంగా పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి, పాల క్యానులను అందించారు. కార్యక్రమంలో సంస్థ సూపర్‌వైజర్ రాఘవ, గోపాల మిత్రులు ప్రవీణ, మహేశ్, ఓదెలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను బడిలో చేర్పించిన సీఆర్పీలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి29: వెన్నంపల్లికి చెందిన కోట సన్నీ 9వ తరగతి వరకు చదివి బడి మానేయగా సీఆర్పీ కుర్మశెట్టి చందర్ గుర్తించాడు. అతనికి వెన్నంపల్లి హైస్కూల్‌లో అడ్మిషన్ ఇప్పించినట్లు తెలిపాడు. బడిబయట పిల్లల సర్వేలో కోట సన్నీ ఇంటి వద్దనే ఉంటున్నట్లు గుర్తించామని సీఆర్పీ తెలిపారు. తారుపల్లిలో సూరం రాజు 8వ తరగతి వరకు చదివాడు. ప్రస్తుతం, అతను కూడా బడి మానేసి ఇంటి వద్దే ఉంటుండగా సీఆర్పీ ఉయ్యాల వీరయ్య గుర్తించాడు. రాజుకు కౌన్సిలింగ్ ఇచ్చి ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ లో ఓపెన్ స్కూల్ లో అడ్మిషన్ ఇప్పించాడు.

పదవి లేకున్నా.. ప్రజల పక్షాన ఉండాలి

మాజీ కార్పొరేటర్లతో కోరుకంటి చందర్

- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- మాజీ కార్పొరేటర్లకు సన్మానం

గోదావరిఖని/కోల్‌సిటీ, జనవరి 29: ఇప్పుడు తమకు పదవి లేదని ఆలోచించవద్దని, ప్రజల పక్షాన ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన బాధ్యత ఇప్పుడే మొదలైందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న తాజా మాజీ కార్పొరేటర్లను బుధవారం ఆయన సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో సంక్షేమ పథకాలను గడప గడపకూ అందించిన కార్పొరేట ర్ల కృషిని ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. కార్పొరేషన్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించుకుంటూ ప్రతి డివిజన్‌లో మౌలిక వసతులు కల్పించడంలో అందరు కుటుంబ సభ్యుల్లా పని చేశారని, ప్రధానంగా ప్రతి ఇంటికి మిషన్ భగీరథ అందించిన ఘనత మనకే దక్కుతుందన్నారు. కేసీఆర్ బంగారు తెలంగాణలో భాగస్వామ్యం కావడం, మాజీ మంత్రి కేటీఆర్ పట్టణ ప్రగతిలో డివిజన్ అభివృద్ధి బాట పట్టిందన్నారు. అనంతరం తాజా మాజీ కార్పొరేటర్లు రాకం లత దామోదర్, కన్నూరి సతీశ్‌కుమార్, బొడ్డు రజిత రవీందర్, పెంట రాజేశ్, పాముకుంట్ల భాస్కర్, కుమ్మరి శ్రీనివాస్, మౌనిక జేవీ రాజు, రమణారెడ్డి, కృష్ణవేణి భూమయ్య, ముదాం శ్రీనివాస్, బాదె అంజలీ, గాదం విజయ, మాజీ కోఆప్షన్ సభ్యులు తస్నీం భాను, వంగ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొలిపాక శరణ్య మధుకర్, శ్రీవాణి కిరణ్‌ను సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ఎలిగేడు, జనవరి 29: ధూళికట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో మాధవి బుధవారం సందర్శించారు . విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు ,అభ్యసనాభివృద్ధి కార్యక్రమం అమలు, ఆన్‌లైన్ నమోదు, మధ్యాహ్న భోజనం మెనూ, పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు .విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో ప్రశ్నలకు ప్రాక్టీస్ చేయాలని,ఇంటివద్ద టివి,చరవాణి లు వాడకూడదని ప్రతి అంశం పై అవగాహన కలించారు. ఇక్కడ హెచ్ఎ బిదిరి సదయ్య, పీఎస్ హెచ్ఎం వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జూలపల్లి, జనవరి 29 : వడ్కాపూర్ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థి గౌతమ్‌కుమార్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం దూస రమేశ్, పీఈటీ మహేందర్ తెలిపారు. సుల్తానాబాద్‌లోఎస్జీఎఫ్ అండర్-14 విభాగంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి పోటీల్లో గౌతమ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబర్చగా ఎంపిక చేశారు. ఈ క్రమంలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో మేడ్చల్‌లో నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఆర్జీ-3లో పర్యావరణ జీఎం పర్యటన

రామగిరి, జనవరి 29: సింగరేణి పర్యావరణ విభాగం జీఎం బానోతు సైదులు బుధవారం ఆర్జీ-3 ఏరియాలో పర్యటించారు. మొదటిసారిగా ఏరియాకు వచ్చిన ఆయనకు జీఎం సుధాకర్ రావు స్వాగతం పలికారు. మొక్క అందజేసి సన్మానించారు. అనంతరం ఆర్జీ-1,2,3, భూపాలపల్లి ఏరియాల పర్యావరణ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర పర్యావరణ విభాగం నిబంధనలు, విధి విధానాలు, సూచనలకు అనుగుణంగా తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఇంజినీర్ శేఖర్‌బాబు, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, పర్యావరణ అధికారి రాజారెడ్డి, సర్వే అధికారి జనార్దన్ రెడ్డి, సుదర్శనం పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

రామగిరి జనవరి 29 : కల్వచర్లలోని పోచమ్మ ఆలయం వద్ద గంజాయి విక్రయిస్తున్న పలువురిని బుధవారం అరెస్టు చేసినట్లు రామగిరి ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. కల్వచర్ల గ్రామానికి చెందిన చిప్పకుర్తి అజిత్, పెద్దపల్లి నుంచి వచ్చిన పెంచాల సాయికృష్ణ, దేవర్నేని సుమంత్, కొదురుపాక కు చెందిన వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. వీరిలో కల్వచర్లకు చెందిన చిప్పకుర్తి అజిత్ పోలీసులను చూసి పరారయ్యాడు. ఈ సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసి వారి నుంచి 30 గ్రాముల గంజాయి,బైక్, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

మెడికల్ కార్డుల దరఖాస్తు గడువు పెంపు

రామగిరి, జనవరి 29: సింగరేణి సంస్థలో వివిధ కారణాలతో ఉద్యోగ విరమణ పొందిన వారు వైద్య సేవలు పొందేందుకు ఏర్పాటు చేసిన కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీం కింద సభ్యత్వం కోసం 2025 మార్చి 31వ తేదీలో సంబంధిత గనిలో సంప్రదించి దరఖాస్తు అందజేయాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు తెలిపారు. ఈ స్కీం కింద సభ్యత్వం కోసం రూ.60వేలు చెల్లించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి

ర్యాలీ తీస్తున్న పోలీసులు

పెద్దపల్లి టౌన్, జనవరి29: ప్రైవేట్ వాహనాల డ్రైవర్లఉ ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని ఆర్టీవో రంగారావు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని ఐటీఐ మైదానంలో ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన కల్పించారు. అనంతరం ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని చెప్పారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దని సూచించారు. ప్రమదాలు జరిగినప్పుడు సామాజిక బాధ్యతగా క్షతగాత్రులను సమీపంలోని దవాఖానలో చేర్చాలన్నారు. ప్రమాద రహిత జిల్లాగా పేరు తీసుకురావాలని కోరారు. తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ఇక్కడ ట్రాఫిక్ సీఐ బర్ల అనిల్‌కుమార్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఏఎంవీఐ మధు, ఆటో యూనియన్ నాయకులు బోంకూరి నర్సయ్య, రాజయ్య, తాహెర్, అజ్గర్, రాము, చంద్రయ్య, రెడ్డి, రామరాజు, తిరుపతి పాల్గొన్నారు.

జీఎం కార్యాలయాల్లో నిర్మాణాత్మక సమావేశం

గోదావరిఖని, జనవరి 29: సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో బుధవారం ఎస్‌వోటూ గోపాల్‌సింగ్ అధ్యక్షతన గుర్తింపు సంఘం ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం జరిగింది. గత నెలలో జరిగిన సమావేశంలో తీసుకున్న సమస్యల్లో కొన్నింటికి పరిష్కారం లభించిందన్నారు. తాజాగా మరోపది సమస్యలపై చర్చించారు. ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ సెక్రటరీ అరెల్లి పోశం, సెంట్రల్ సెక్రటరీ స్వామి, రంగు శ్రీనివాస్, ఏజీఎం డీవి రావు, అధికారులు అంజనేయులు, శివనారాయణ, ఇన్‌చార్జి జీఎం చంద్రశేఖర్, కిరణ్ బాబు, ధనలక్ష్మీబాయి, చిలుక శ్రీనివాస్, రమేశ్, బీమా, వరప్రసాద్, డాక్టర్ డీవై సీఎంవో అంబిక, జితేందర్ సింగ్, శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, రాజేశ్, వీరారెడ్డి, మహేశ్, వెంకటరెడ్డి, మల్లికార్జున్, శంకరయ్య ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 29 : ఆర్జీ-2 ఏరియాలో బుధవారం ఏరియా జీఎం బండి వెంకటయ్య అధ్యక్షతన గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో స్ట్రక్చర్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గుర్తింపు సంఘం నాయకులు డివిజన్‌లో నెలకొన్న 11 సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ఈపీ సీనియర్ మెకానిక్, సీనియర్ ఎలక్ట్రిషియన్, ఆపరేటర్ల ఖాళీలను భర్తీ చేయాలని, సీహెచ్‌పీలో డస్ట్ నివారణకు చర్యలు తీసుకోవాలని, 6సీహెచ్‌పీ జీఎల్ బంకర్‌లో ఫ్యాన్ సామర్థ్యం పెంచాలని, ఫ్లోడీడర్‌లో సంప్ డ్రైన్ లైన్‌ను శుభ్రం చేయాలని, ఆర్జీ-2 వర్క్‌షాప్‌లో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, జనరల్ మజ్దూర్ల ఖాళీలను భర్తీ చేయాలని సూచించారు. ప్రధానంగా కాలనీ, పోతన కాలనీలో నీటి ఎద్దడిని తీర్చేలా చర్యలు చేపట్టడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు బ్రాంచ్ కార్యదర్శి జీగురు రవీందర్, కే. రాజరత్నం, శ్యాంసన్, సాంబశివరావు, అధికారులు మధుసూధన్, నెహ్రూ, సంతోష్ కుమార్, ఎర్రన్న, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

వాస్తు చూడబడును

★వాస్తు చూడటం, ఇంటి మోడల్ ప్లానులు తీయడం, భూమి కొలతలు తీయడం,ఆటోక్యాడ్‌లో డ్రాయింగ్ చేయడం నేర్పబడును, వాస్తు చూడబడును. సంప్ర॥ M. రాజేష్, సెల్ : 9502438614
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ట్రినిటీ విద్యార్థులు

క్రీడాకారులను అభినందిస్తున్న దాసరి మమతా రెడ్డి

పెద్దపల్లి కమాన్, జనవరి 29 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఇటీవల కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్దపల్లి ట్రినిటీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఫిబ్రవరి 4న ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు కే దిలీప్, ఎల్ సంజయ్, బీ అభిషేక్, డీ అభినయ్ పాల్గొననున్నారు. బుధవారం ట్రినిటీ స్కూల్ లో విద్యాసంస్థల ఫౌండర్, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందజేసి, అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఇక్కడ పీఈటీ ఠాకురే కిషోర్ సింగ్, ఎండీ. షఫి, ఆర్ వెంకటేశ్, బీభూపతి శేఖర్, వీ మహేందర్, స్వప్న తదితరులున్నారు.

వేసవిలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

పెద్దపల్లి, జనవరి29: రానున్న వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ అశోక్ కుమార్ సూచించారు. బుధవారం పెద్దపల్లి ఎస్ఈ కార్యాలయంలో వేసవిలో విద్యుత్ కార్యాచరణపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాబోయే వేసవి లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను పెడుతున్నట్లు తెలిపా రు. వేసనిలో విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. గోదావరిఖని, రామగుండం, మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లోని 186 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ప్రతిపాదించామని చెప్పారు. ఇప్పటికే 11 ట్రాన్స్‌ఫార్మర్లలను పెట్టి చార్జి చేసినట్లు చెప్పారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ మేరకు సప్లై చేసేందుకు ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఎస్ ఈ కంకటి మాధవరావు, డీఈ (టెక్నికల్) రవి, డీఈలు (ఆపరేషన్) తిరుపతి, ప్రభాకర్, ఏడీ ఈలు సుగణయ్య,అన్నపూర్ణ పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

- రూ. 1.56లక్షలు, 112 తులాల వెండి అపహరణ

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 29: రామగిరి మండలం గడ్డంపల్లి గ్రామంలోని రెండు ఇండ్లలో చోరీ జరిగింది. రూ. 1.56లక్షల నగదుతోపాటు 112 తులాల వెండి, 4గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు తెలిసింది. ఘటనకు సంబంధించి గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని గడ్డం రాజయ్య, గడ్డం సంపత్ తండ్రీకొడుకులు. ఒకే ఇంట్లో వేర్వేరుగా ఉంటున్నారు. రాజయ్య అనారోగ్యానికి గురికావడంతో ఈ నెల 16న ఇంటికి తాళాలు వేసి కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొంది బుధవారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి వచ్చే సరికి తలుపులు తీసి ఉండడంతోపాటు ఇంట్లోని బీరువాలు, వస్తువులన్ని చిందర వందరంగా పడి ఉన్నాయి. దీంతో వెంటనే గోదావరిఖని టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ ప్రసాద్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

అంతర్గాం ఎంపీడీవో మృతి

అంతర్గాం, జనవరి 29: అంతర్గాం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి అలీం గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కరీంనగర్ లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకవెళ్తుండగా పెద్దపల్లి దాటిన తర్వాత మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృత దేహంను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు.

పెద్దపల్లి టౌన్, జనవరి29: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల పరిషత్ డెవల్మెంట్ అధికారి వాజీద్ ఆలీ గుండెపోటుతో మృతి చెందగా బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు పార్థివ దేహాన్ని తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష వెంటనే దవాఖానకు వచ్చారు. వాజీద్ ఆలీ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వాజీద్ ఆలీ మృతదేహాన్ని కరీంనగర్‌లోని ఆయన నివాసంకు తరలించారు. ఇక్కడ డీసీహెచ్ ఎస్ డాక్టర్ శ్రీధర్, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

అవగాహన ఉండాలి

పెద్దపల్లి, జనవరి 29: జంతు సంరక్షణకు పాటించాల్సిన నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, నిబంధనల మేరకు జంతువులను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. జంతు సంరక్షణ చర్యలపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జంతు సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం జాతీయ జంతు కల్యాణ మండలి (ఎనిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా)ను స్థాపించిందని తెలిపారు. కుక్క కాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కుక్క ఒకవేళ కరిస్తే వెంటనే తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స పై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ,జీ ప్రకారం అడవులు, సరస్సులు, నదులు వన్యప్రాణులతో సహా సహజ పర్యావరణాన్ని రక్షించడం, జీవుల పట్ల కరుణ కలిగి ఉండడం ప్రతి పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన కారు

విషాదయాత్ర

- దైవదర్శనానికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం
- కాట్నపల్లి శివారులో కల్వర్టును ఢీకొట్టిన కారు
- భార్యాభర్తలతోపాటు వియ్యంకుడి మృతి
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- సిద్దిపేటలో విషాదం

సుల్తానాబాద్ రూరల్, జనవరి 28: వారంతా సిద్దిపేట జిల్లావాసులు. కాళేశ్వరం దైవ దర్శనానికి తొమ్మిది మంది కారులో సిద్దిపేట నుంచి బయలుదేరారు. మార్గంమధ్యలో వీరి కారు కల్వర్టును ఢీకొనడంతో భార్యాభర్తలతోపాటు వియ్యంకుడు మృతిచెందగా, ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులోని రహదారిపై జరిగింది. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన ఆకుల కనకయ్య (60)-తార (50) దంపతులు. వీరు కొడుకు శ్రీనివాస్, మనువళ్లు అద్విత్, మాన్విత్ తోపాటు శ్రీనివాస్ అత్తామామలు రమాదేవి-జనార్దన్ (45), బామ్మర్ది మనోజ్ కుమార్, డ్రైవర్‌తో కలిసి బుధవారం తెల్లవారుజామున సిద్దిపేట నుంచి కాళేశ్వరం దైవ దర్శనానికి కారులో బయలుదేరారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారుకు చేరుకోగానే వీరు ప్రయా ణిస్తున్న కారు ప్రమాదవశాత్తూ రహదారి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. దీంతో ఆకుల కనకయ్య, ఆకుల తార, జనార్దన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్‌తోపాటు అతడి కొడుకులు అద్విత్, మాన్విత్, అత్తమ్మ రమాదేవి, బామ్మర్ది మనోజ్ కుమార్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వీరిని కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తరలిస్తుండగా, మార్గం మధ్యలో కనకయ్య, తార మృతి చెందారు. దవాఖానలో చికిత్స పొందుతూ జనార్దన్ చనిపోయాడు. బాధిత కుటుంబ సభ్యులు దవాఖానకు చేరుకుని బోరున విలపించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో సిద్దిపేటలో విషాదం నెలకొన